సీరియల్ -

[illegible]

[illegible]

(గత సంచిక తరువాయి)

అతని చేతిలోనుంచి తన చేతిని విసురుగా లాక్కొని "ఏమిటి మీరు మాట్లాడదలచుకున్నది?" అన్నది మామూలుగా వుండటానికి ప్రయత్నిస్తూ.

"మిస్ దివ్యా, మీరు నన్నపార్థం చేసుకోనంటే ఒక్క మాటడుగుతాను...."

"ఏమిటది?"

"విని కోపించరు కదా...."

"ఏమిటో చెప్పకుండా కండిషన్స్ ఏమిటి?"

"నేను పైలెట్ గా పదిహేనేళ్ళుగా పని చేస్తూన్నాను. నాకు అన్నిటిలో కలుపుకుని నెలకు అయిదు వేల వరకు వస్తాయి. ఇంకా పెళ్ళికాలేదు. నన్ను పెళ్ళాడటానికి యెందరో కోటీశ్వరుల కూతుళ్ళు బారులుతీరి వున్నారు. కాని నాకు వాళ్ళెవరూ నచ్చలేదు. నేను కోరుకున్న అమ్మాయి వాళ్ళలో లేదు...." ఓ క్షణం ఎఫెక్టు కోసం ఆగి ఆమె ముఖంలోకి చూశాడు.

దివ్య ముఖం చాలా గంభీరంగా వుంది.

"నన్ను చేసుకోబోయే అదృష్టవంతురాలు, నా మనసు దోచుకున్న అమ్మాయి యెవరో తెలుసా?"

ఎవరని దివ్య అడగలేదు. అతనే చెప్పాడు. "నువ్వే. మిస్ దివ్యా!"

అరికాలిమంట నెత్తికెక్కింది దామెకు.

అంతవరకు బహువచనంలో మాట్లాడి, ఇదివరకు ఏర్పోర్టులో మల్లే మళ్ళీ ఏకవచనంలోకి దిగి అసభ్యంగా మాట్లాడటాన్నామె సహించలేకపోయింది.

"మీరు వెంటనే ఇక్కడ్నుంచి వెళ్ళిపోండి" తర్జనితో గుమ్మంవైపు చూపిస్తూ, గొంతు పెంచి అన్నది దివ్య.

సునీల్ హతాశుడై ఆమెవంక కోపంగా చూస్తూ లేచి నించున్నాడు.

"కోరి నువ్వే కావాలని వస్తే ఏ ఆడదానికైనా ఆ మగాడంటే చులకనే! నువ్వు అందుకు భిన్నంగా ప్రవర్తించటంలేదు. అనక చింతిస్తావు—మీ పెద్దవాళ్ళ నడగమంటావా?"

"పొమ్మని కసిరినా, ఆత్మాభిమానంలేని వాళ్ళతో నాకు మాటలేమిటి? వెళ్తారా, మా నౌఖర్ని పిలిపించాలా?"

సునీల్ తాచుపాములా బుసకొట్టాడు.

"చూస్తాను, ఈ మిడిసిపాటెన్నాళ్ళో? నీ సిద్ధార్థ బతికి మళ్ళీ నిన్ను చూడవస్తాడనుకుంటున్నావేమో.... ఉత్త భ్రమ! ఈరోజు అఫీషియల్‌గా అతనికోసం ప్రత్యేక విమానం అన్వేషించటానికి వెళ్తోంది. నేనూ వెళు న్నాను. అతను కనిపిస్తే స్పాట్‌లోనే చంపి పాతేస్తాను" చరచరా బయటికి వెళ్ళిపోయాడు.

దివ్య మాటరానిదానిలా బొమ్మలా అలాగే నిల్చుండి పోయింది కాసేపు. తర్వాత తలుపు మూయటానికి ముందుకు కదిలింది.

సరిగ్గా అప్పుడే యొవరో ఓ యువతి గుమ్మం మెట్లెక్కుతోంది. దివ్య విస్మయంగా చూసిందామె వంక.

"మీ పేరు దివ్య కదూ...." అన్నదామె.

అవునని తలూపింది దివ్య సందిగ్ధంతోనే.

"నేను మీతో రెండు నిమిషాలు మాట్లాడాలనుకుంటున్నాను. మీకభ్యంతరమా?" మర్యాద, సంస్కారం వుట్టిపడే గొంతులో తియ్యగా అడిగిందామె.

"అబ్బెబ్బే ప్లీజ్ కమ్" అన్నది దివ్య తలుపులు బార్లా తెరిచి.

ఆమె "థాంక్స్" చెప్పి లోపలికొచ్చి దివ్య చూపిన సీట్లో కూచొని, "నా పేరు రమ్య. ఎర్ హోస్టెస్ గా పని చేస్తున్నాను. సిద్ధారతో నాకు ఉద్యోగరీత్యా మంచి స్నేహ భావముంది" అన్నదామె.

చేదుకూర తిన్నట్టు ముఖం పెట్టింది దివ్య.

"అఫ్ కోర్స్, అతని గురించి మీకు చెడుగా చెప్పిన వాళ్ళ గురించి నాకు తెలుసు. సుస్మిత నిప్పులాంటి దనుకుంటే సిద్ధార అగ్నిలాంటివాడు. ఇద్దరూ చాలా పవిత్రులు. వాళ్ళని అనుమానించటం అమానుషం, అన్యాయం!" అన్నది రమ్య.

"ఇంతకు మీరు వచ్చిన పని....!?"

"సిద్ధార గార్ని పొగడటానికి మాత్రంకాదు. మీకు ఉన్న నిజాన్ని చెప్పి కద్దామని. మీ మనసులో అతని పట్ల పేరుకుపోయిన ఏహ్యభావాన్ని, అయిష్టతను తొలగించటానికి నావంతు ప్రయత్నం చెయ్యాలని వచ్చాను.

ఆ రోజు సిద్ధార్థ పడిపోయిన ఫ్లైట్‌లోని ఏర్
హోస్టెస్‌లలో నేనొకతెను. సునీల్ కావాలనే సిద్ధార్థని
బయటికి తోసేశాడు. సుస్మితమీద సునీల్ ఎన్నాళ్ళు
గానో కన్ను వేసివున్నాడు. ఆమె ఎదురుతిరిగింది. అవ
కాశం దొరగ్గానే ఆమెను కూడా ప్లేన్‌లోనించి కిందికి
తోసేశాడు. వాళ్ళు కావాలని దూకేశారని కథ అల్లి
చెప్పాడు....” ఓ క్షణం ఆగింది రమ్య.

దివ్య ముఖంలో అతి వేగంగా రంగులు మారిపోవ
టాన్ని స్పష్టంగా గుర్తించిందామె. దివ్య ముఖంలో
యిప్పుడు ఆసక్తి, ఆశ్చర్యం దోబూచులాడుతున్నాయి.

“సిద్ధార్థ మాతో ఎన్నోసార్లు మీ ఇద్దరి ప్రణయం
గురించి చెప్తూ మిమ్మల్ని తన హృదయాధి నేతగా ఎంతో
గొప్పగా వర్ణిస్తూ, అందంలో మాకు మేమే సాటి అని
మురిసిపోయే మాకే అసూయ కలిగేలా మీ గురించి చెప్పే
వాడు. అతని మాటలోను, మనసులోను మీరే అను
క్షణం మెదుల్తుండేవారు.

నిజంగా అలాంటి గొప్ప ప్రేమికుడి కోసం ఆడది
ఎన్ని త్యాగాలైనా చెయ్యగలదు. మీ అదృష్టానికి మేం
ఈర్ష్యపడేవాళ్ళం. అలాంటి సిద్ధార్థని అనుమానించటం;
అతని వ్యక్తిత్వాన్ని అవమానించటమే, అతనికి ద్రోహం
చెయ్యటమే అవుతుంది.”

రమ్య మాటలు దివ్య గుండెల్లో సమ్మెటపోటుల్లా తగి
లాయి.

“సిద్ధూ, నన్ను క్షమించు.... నేను చాలా ఘోరంగా
నిన్నపార్థం చేసుకున్నాను” ఆమె మనసు ఆక్రోశి
స్తోంది.

"కాని....సుస్మిత...." ఏదో చెప్పబోయి ఆగి పోయింది.

"మీ అనుమాన మర్థమయింది. సుస్మిత అతన్ని ప్రేమించి వుండొచ్చును కదా అని కదూ, మీ రన బోయేది! మంచివాళ్ళని ప్రతి ఒక్కరూ ప్రేమిస్తారు. ఆ మాటకొస్తే నేనూ సిద్ధార్థని ప్రేమిస్తున్నాను—ఓ సహృదయుడయిన మంచి స్నేహితుడిగా ఆత్మీయుడిగా, అంత మాత్రాన....?!"

దివ్య తన ఆలోచనకి సిగ్గుపడింది. "సారీ!...." అన్నది.

"మరో ముఖ్యమైన విషయం చెప్పటం మరిచాను. సుస్మిత మృతదేహాన్ని మా సిబ్బంది కనుగొన్నారు. ఆమె ప్లేన్ నించి పడిపోయినపుడు ధరించిన చీరను, ఆ చీరకున్న ఆమె నేమ్ గల బాడ్జిని బట్టి! అస్థిపంజరం మాత్రమే దొరికింది. ఓ గోతిలో నుంచి యేవో జంతువులు ఆమె శరీరాన్ని పైకి లాగి తింటుండగా చూశారు మా సిబ్బంది.

గోతిలో ఆమెను పాతిపెట్టే అవసరం యెవరికుం టుంది? మేము అనుకునేదేమిటంటే, సిద్ధార్థ బతికేవున్నాడని, అతనే ఆమెకు చివరి వీడ్కోలు ఇచ్చి ఆమె శరీరాన్ని ఖననం చేసివుంటాడనీ!..."

ఒళ్ళంతా చెవులు చేసుకుని విన్నది దివ్య....

"అయితే నా సిద్ధార్థ ...." ఆనందంతో ఆమె గొంతు పూడుకుపోయింది.

"అతన్ని సజీవంగా చూడగలమనే మేం యెదురు చూస్తున్నాం. ఆఖరి ప్రయత్నంగా ఈ రోజు మరో ప్లేన్ వెళ్తోంది అతన్ని వెతకటానికి...."

సునీల్ మాటలు గుర్తొచ్చి నిలువెల్లా వణికిపోయింది దివ్య.

"అయితే సునీల్ సిద్ధార్థను చంపేస్తాడా?" అంది హిస్టీరికల్‌గా.

"సునీల్ సిద్ధార్థని చంపటమేమిటి?" రమ్య ఆశ్చర్యంగా అడిగింది.

దివ్య సునీల్ వచ్చి బెదిరించి వెళ్ళిన విషయం చెప్పింది.

"రాస్కెల్! వాడికెక్కడికెక్కడా తగలడ్డాడా? మీకేం భయంలేదు. సునీల్‌ని తప్పనిసరిగా తీసుకు వెళ్తారు మా సిబ్బంది—స్పాట్‌ని లొకేట్ చెయ్యటం కోసం! సిద్ధార్థ కనిపించినా సునీల్ ఏం చెయ్యలేడు. అతని వెంట ఏర్‌ఫోర్స్ అధికారులు సెక్యూరిటీ సిబ్బంది వుంటారు. అతను సిద్ధార్థని చంపే దుస్సాహసం చెయ్యడు. మీరు నిశ్చింతగా వుండండి" అంది రమ్య ధైర్యం చెపుతూ.

దివ్య మనస్సులో అగ్నిపర్వతాలు బద్దలవుతున్నాయి. తను సిద్ధార్థని మళ్ళీ కళ్ళ చూడగలదా? అతను క్షేమంగానే వున్నాడా యిన్నాళ్ళు? ఏమో !?

"నేను వెళ్తాను మేడమ్. మీరు సిద్ధార్థ గురించి వర్రీ కాకండి. ఎవ్విరి థింగ్ విల్ బీ ఆల్ రైట్!" అంటూ వెళ్ళిపోయింది రమ్య.

దివ్య శిలాప్రతిమలా నిల్చుండిపోయింది చాలా సేపు....

• • •

సిద్ధార్థ చాలా స్పాంటేనియస్‌గా పక్కకి తప్పుకుని వుండకపోతే బందిపోటు వేటుకి అతని తల మొండెం

నుంచి వేరయిపోయుండేది!

ఆ మరుక్షణమే కోయిల చేతిలోని బాణాకర్ర ఆ బందిపోటు వెన్నులో నుంచి గుండెల్ని చీల్చుకుని ఛాతీ నుంచి బయటికొచ్చింది.

పెద్దగా అరుస్తూ నేలకూలిపోయాడు ఆ బందిపోటు!

ఆ కేక ఆ గూడెంలో ప్రతిధ్వనించింది. గస్తీ తిరుగుతున్న యిద్దరు బందిపోట్లు, అంతక్రితమే ఎవరినో దోచుకుని మూటలు కట్టి తెచ్చిన బందిపోట్లు నలుగురు పరుగున అక్కడికొస్తూ కనిపించారు.

కోయిల, సిద్దార్థ ప్రమాదాన్ని గుర్తించారు.

“మనం ఏదీ నిర్ణయించుకునే లోపల జరగకూడనిది జరిగిపోయింది. ఈ గస్తీ బందిపోటు మనల్ని కనిపెట్టి చంపబోయాడు. వాడ్ని నోరు నొక్కి చంపి వుండాల్సింది, తొందర్లో ఆ విషయాన్ని విస్మరించి చంపేశాను. ఇక గూడెమంతా నిద్రలేచిపోయిందంటే మనకి అవకాశం చేజారిపోతుంది. ఆ వచ్చే ఆరుగురిని ముందు శాశ్వతంగా నిద్ర పుచ్చితేనేగాని మనకి రక్షణ వుండదు. ఈ కత్తి నువ్వుందుకో. వాళ్ళని మెలకువగా వ్యవహరించి మట్టుబెట్టాలి!”

అంటూ అతని చేతిలోని బాణా కర్రని కూడా తను అందుకుని యెటాక్ చెయ్యటానికి సిద్ధంగా నిల్చుంది కోయిల.

సిద్ధార్థ వచ్చిన బందిపోటు పట్టాకత్తిని చేత ధరించి సన్నద్ధుడయ్యాడు.

సరిగ్గా అప్పుడే బందిపోట్లు ఆరుగురు ఒకరి వెంట మరొకరు అక్కడికి చేరుకున్నారు.

మొదటి యిద్దరు అక్కడికి చేరుకుంటుండగానే సిద్ధార్థ పట్టాకత్తితో వెనకనుంచి దాడి చేసి వాళ్ళ తలలు నరికేశాడు. తక్కిన నలుగురికి ఈ విషయం తెలియకముందే ఆ గస్తీ బందిపోట్లని బండరాళ్ళ వెనక దాచేశారిద్దరు కలిసి.

ఇప్పుడు వాళ్ళ పట్టాకత్తులు కూడా జతచేస్తే మూడు కత్తులు రెండు బాణాకర్రలు ఆయుధాలుగా, తక్కిన నలుగురికి మరణ ముహూర్తం పెట్టేశారు కోయిల, సిద్ధార్థ.

అయితే వాళ్ళ నలుగురు నాలుగువైపులకి విడిపోయి వాళ్ళని కమ్ముకుంటూ వచ్చేశారు.

వాళ్ళ రావటం ఎత్తులో వున్న సిద్ధార్థ కోయిల స్పష్టంగా గుర్తించారు.

దూరంనించే గురిచూసి బాణాంకర్రల్ని విసిరి ఇద్దరిని నేలకూల్చింది కోయిల.

రెండు చేతుల్లో రెండు పట్టాకత్తులు ధరించిన సిద్ధార్థ వీరభద్రావతారం దాల్చినవాడిలా ఆవేశంతో ఊగిపోతున్నాడు.

శత్రువులు బండల వెనక దాక్కొని వున్నారని మిగిలిన ఇద్దరు బందిపోట్లు గ్రహించి ఒక్కసారిగా వెనుతిరిగి గూడెంవైపు పరుగెత్తబోయారు.

అంతే! కోయిల విసిరిన పట్టాకత్తి ఒకడిని సిద్ధార్థ విసిరిన కత్తి మరొకడిని అమాంతంగా నేల కూల్చేశాయి.

అయితే నేలకూలిపోతూ వాళ్ళిద్దరు పెద్దగా అరిచారు. అది శత్రువులు దాడిచేశారనే సంకేతం! ఆగి ఆగి వింత శబ్దాలతో సైరన్‌లా మోగాయి వాళ్ళ గొంతులు.

తర్వాత....వాళ్ళ గొంతులు శాశ్వతంగా మూగ బోయాయి.

తెల్లవారుఝామున మూడున్నర గంటల సమయాన, ఆదమరిచి నిద్రిస్తున్న ఆ బందిపోటు ప్రాకారంలోని చాలా మందికి ఆ ఇద్దరి సంకేతం అందలేదు.

అందిన కొద్దిమంది యిళ్ళలోనుంచి బయటికి పరుగెత్తు కొచ్చారు. అయితే ఆ సంకేతం యెటునుంచి వచ్చిందో వాళ్ళకి వెంటనే అర్థం కాలేదు.

కాసేపు చూసి గస్తీ బందిపోట్లు జాడ కనిపించక పోవటంతో చకచకా అందరిని నిద్ర లేపటం మొదలెట్టారు.

కోయిల సిద్ధార్థ ఎలర్టుగా నించున్నారు. ఇప్పుడు వాళ్ళ దగ్గర ఆరు కత్తులు, రెండు బాణం కర్రలు వున్నాయి.

"విల్లమ్ములుంటే యెంత బావుండును....!" అను కొన్నది కోయిల........అవి వుంటే యెంత దూరం నుంచయినా శత్రువుని గురి చూసి బాణాలు నాటగల దామె.

ఏం చెయ్యాలో ఎలా ఎటాక్ చెయ్యాలో సరిగ్గా ప్లాన్ చేసుకోకముందే వేగంగా జరిగిపోతున్న సంఘటన లకి రవంత ఆశ్చర్యంతో ప్రశార్థకంగా ఆమెవైపు చూశాడు సిద్ధార్థ.

"వాళ్ళకి మనమెక్కడ దాక్కొని వున్నామో ఇంకా తెలియదు. కాని తెలుసుకోవటం పెద్ద కష్టం కాదు. ఈలోపల మనం వాళ్ళనెలా సంహరించాలో ఓ నిర్ణయానికి రావటం చాలా అవసరం...." అన్నది కోయిల.

మనిద్దరం వాళ్ళ కెదురుపడి సంహారించటం జరిగే పని కాదు....నలుగురైదుగురుని చంపేలోగా వాళ్ళందరు కలిసి మన శరీరాల్ని ముక్కలు ముక్కలు చేసేస్తారు. మనం బయటపడకుండా వాళ్ళని మట్టుబెట్టాలి" చెప్పాడు సిద్ధార.

దగ్గర గోలగా అరుచుకుంటూ గూడెంలోని మనుషు లంతా గుంపుగా చేరిపోతున్నారు. స్త్రీలు, పిల్లలు, వృద్ధులు తప్పిస్తే యితరులు, మధ్యవయస్కులయిన బందిపోట్లు దాదాపు ఏభైమందికి పైగానే వున్నట్టు గమనించారిద్దరు.

"వాళ్ళు తమలో తామేదో చర్చించుకుని జట్లుగా విడిపోతున్నారు. వెతకటానికి నిర్ణయించుకుంటున్నట్టు కనిపిస్తోంది. అలా జరిగితే మనకి వాళ్ళని నాశనం చెయ్యటం తేలికవుతుంది" అన్నాడు సిద్ధార.

"మనమీ బండరాళ్ళ వెనక వున్నట్టు తెలిస్తే తక్కిన వాళ్ళందరు యిక్కడికే వచ్చి మనలిని చుట్టుముట్టేసారు. అప్పుడు తప్పించుకోలేము" అన్నది కోయిల సాలోచనగా.

ఇద్దరు తర్జనభర్జనలు చేసుకుంటుండగానే బందిపోట్లు ఏభైమంది నాలుగు జట్లుగా చీలిపోయి నలువైపులా శత్రువుల కోసం వెతకటం మొదలెట్టారు.

కోయిల, సిద్ధార చాలా తొందరగా ఓ నిశ్చయానికొచ్చేశారు.

గూడెం చుట్టూ బండరాళ్ళు వలయంగా పేర్చబడి వున్నాయి. తామున్న చోటికి ఒక జట్టు వస్తే తక్కిన మూడు జట్లు మూడువైపులకి వెళ్తాయి. తమవైపు వచ్చిన

బందిపోట్లని బండరాళ్ళ వెనుక పొంచివుండి మట్టుపెడతారు.

అక్కడ పని పూర్తికాగానే మరోవైపుకి మెల్లగా నక్కి చేరుకుంటారు. అక్కడికి చేరిన బందిపోట్లని కూడా అలాగే సంహరించి తక్కిన రెండువైపులకి అదేవిధంగా చేరుకుని, అక్కడికి వచ్చే బందిపోట్లని సంహరిస్తారు.

కర్ర విరక్కుండా పాము చస్తుంది.

స్త్రీలు, వృద్ధులు, పిల్లల్ని తామెలాగూ వదిలెయ్యదలచుకున్నారు. తమ టార్గెట్ గూడేలకి గూడేలు దోచుకుంటున్న వయసులో వున్న ఆ బందిపోట్లు! వాళ్ళే ఇప్పుడు కోరి తమ చావును వరిస్తున్నారు!

కోయిల, సిద్ధార్థ పథకం కొంతవరకు మంచి ఫలితాన్నే ఇచ్చింది.

ముందుగా చేరిన పదిహేనుమంది బందిపోట్లను తమ పథకం ప్రకారం చాటునుండి దెబ్బకు నలుగురు చొప్పున నేలకూల్చేశారిద్దరు కలిసి.

అయితే వాళ్ళు చస్తూ పెట్టిన కేకలతో శత్రువులెక్కడున్నారో తక్కిన బందిపోట్లకి తెలిసిపోయింది. అంతే! ఒక్కసారిగా వాళ్ళంతా కోయిల సిద్ధార్థ దాగి వున్న బండరాళ్ళవైపు పరుగెత్తుకుంటూ వచ్చారు.

అయితే, అప్పటికే వాళ్ళిద్దరివద్ద చాలా ఆయుధాలు పోగుపడ్డాయి. వాటిని ప్రయోగించి వీలయినంతమందిని సంహరించాలని నిర్ణయించుకున్నారు.

కోయిల రెండు చేతుల్తో రెండు కత్తులు ధరించి రుద్రకాళికలా వాళ్ళమీదకు విరుచుకు పడింది.

వాలుగా వున్న ప్రదేశం నుంచి వాళ్ళు పైకి— తామున్న ప్రదేశానికి—ఎక్కుతూ వస్తున్న సమయంలో

తమ దగ్గరున్న కత్తుల్ని ఒకటొకటి వాళ్ళమీదకు విసిరారు కోయిల, సిద్ధారలు.

వాళ్ళ గురి సూటిగా టార్గెట్స్‌ని తాకటం, ఒకేసారి నలుగురు చొప్పున బందిపోట్లు హాహాకారాలు చేస్తూ నేల కూలిపోవటం చాలా వేగంగా జరిగిపోయింది.

అప్పటికే ముప్పయిమందికి పైగానే శత్రువులు నేల కూలిపోయారు. తక్కినవాళ్ళు తమదగ్గరున్న ఆయుధాల్ని మహావేగంగా బండరాళ్ళవైపు విసిరారు.

అయితే బండల వెనుకనున్న కోయిల సిద్ధారలని చేరకుండానే అవన్నీ బండరాళ్ళకి కొట్టుకొని ఖంగున శబ్దం చేస్తూ నేలమీద వ్యర్థంగా పడిపోయాయి.

అయినా వాళ్ళు మహోగ్రంగా కేకలు పెడుతూ పైకి, పైపైకి వచ్చేస్తున్నారు.

కోయిల దగ్గర రెండు బాణం కర్రలు తప్ప ఆయుధాలన్నీ ఖర్చయిపోయాయి.

అప్పుడు సిద్ధార స్పాంటేనియస్‌గా నిర్ణయం తీసుకుని ఆమెకు చెప్పాడు.

వరసగా పేర్చబడిన బండరాళ్ళని వాలుగా వున్న బందిపోట్లమీదికి దొర్లించెయ్యటమే! వాళ్ళు పైకి చేరే లోపల ఆ రాళ్ళకింద నలిగి చస్తారు.

"అయితే, ఆ రాళ్ళు వాళ్ళని నజ్జు చేసేసి, దిగువనున్న వాళ్ళ ఇళ్ళను, వాళ్ళ భార్యాపిల్లల్ని కూడా నేలమట్టం చేసేస్తాయి. ఎలా మరి?...." అన్నది కోయిల సందేహంగా.

"నువ్వింకా ఈ రాక్షసుల కుటుంబాల గురించి జాలిపడితే లాభంలేదు. ఈలోపల వాళ్ళు పైకి చేరిపోతారు. మనల్ని నరికి పోగులు పెట్టేస్తారు. నాకూ జాలి వేస్తోంది

పిల్లల్ని చూస్తే.... కానీ అవన్నీ ఆలోచించే వ్యవధి లేదు...." సిద్దార్థ హెచ్చరికతో ఆమె కూడా తన నిర్ణయాన్ని మార్చుకుంది.

మరుక్షణం వాలుగా వున్న చోటికి పైనుండి దబ దబ మంటూ బండరాళ్ళు దొర్లటం ప్రారంభమయింది. ఏ రాళ్ళను తమకు రక్షక వలయంగా పేర్చుకున్నారో ఆ రాళ్ళకింద పడి హాహాకారాలు చేస్తూ నలిగిపోయారు బందిపోట్లు.

అప్పటికి తూర్పు తెల్లవారిపోయింది.

ఎటు చూసినా పీనుగుల గుట్టలతో బందిపోట్ల స్థావరమంతా నానా బీభత్సంగా తయారయింది.

బందిపోట్లతోబాటు చాలామంది స్త్రీలు, పిల్లలు రాళ్ళకింద నలిగి ప్రాణాలు వదలటం చూసి కోయిల గుండె నీరయిపోయింది. ఆ దృశ్యాన్ని చూడలేక తల తిప్పుకున్నది.

"నీ ప్రతిజ్ఞ నెరవేరింది. ఇక వెళ్దామా?" అన్నాడు సిద్దార్థ.

ఆమెకు నిజంగా చాలా సంతృప్తిగా వుంది. తన తండ్రి ఆత్మకు శాంతి కలిగించటమే కాక ఎడారిలోని గూడేలవాసులందరికీ శాశ్వతంగా బందిపోట్ల బెడద తప్పించగలిగినందుకు ఆమెకు చాలా ఆనందంగానూ వుంది.

"నువ్వు నాకు చేసిన సహాయం ఈ జన్మకి మరచిపోను. ఇక నేనిచ్చిన మాట నెరవేర్చుకోవలని వుంది.... పద, నిన్ను స్వామి చెప్పిన గ్రామానికి నేను చేరుస్తాను" అంది కోయిల.

అప్పటికి సూర్యుడు ఉదయించి వేగంగా పైకి వచ్చే

కూస్తున్నాడు.

ఇద్దరూ ఇసుకలో నడుస్తున్నారు.

"సిద్దార్థా, నేనంటే నీ మనసులో ఎలాంటి స్పందనా కలగటం లేదా? నాతో వుండిపోతానని ఒక్క మాట అనకూడదా? జీవితాంతం నీకు సేవ చేస్తూ బతికేస్తాను. లేదా, నీ వెంట నన్ను తీసుకుపో, ఆనందంగా వచ్చేస్తాను. నీ ఇంట కేవలం దాసీగా వుంటూ నీకు పరిచర్యలు చేసుకుంటూ నిన్ను చూసుకుంటూ నా జీవితం గడిపేస్తాను—నన్ను నీ భార్యగా చేసుకోనక్కర్లేదు—కనీసం నీ సేవకురాలిగా వుంచుకోలేవా?"

అని అర్థించాలనుకున్నది కోయిల. కాని ఆమె పెదాలు ఆమె భావాలను పైకి ఉచ్చరించలేకపోయాయి. కాని ఆమె కళ్ళు మాత్రం అతని కళ్ళకు మౌనంగా ఆ మాటల్ని అనువదించాయి.

సిద్ధార్థ ఆమె చూపుల్నుంచి తన దృష్టిని మరలించుకుని, "ఆ గ్రామం యింకా యెంత దూరముంటుంది?" అన్నాడు.

సరిగ్గా అదే సమయంలో వారి తలల మీదుగా రెండుసార్లు చక్కర్లు కొడుతూ యెగిరింది ఓ విమానం.

దిగ్భ్రాంతితో దానివంక చూశాడు సిద్ధార్థ. అతని కళ్ళలో కోటి జ్యోత్స్నల వెలుగు!

ఏర్‌ఫోర్స్‌కి చెందిన ఆ చిన్న విమానాన్ని ఆనందంగా విస్మయంగా ఇంకా ప్రకటించలేని అనేక భావాలతో అపురూపంగా చూశాడు సిద్ధార్థ. కోయిల ఆయోమయంగా చూసింది.

• • •

"ఎస్, హీ ఈజ్ సిద్ధార్థ! నో డౌట్! అదిగో మాసి

పోయి చీలికలయిపోయినా అతని యూనిఫాం స్పష్టంగా కనిపిస్తోంది" విస్మయంగా అరిచింది విమానంలోని ఏర్ హోస్టెస్ రమ్య.

విమానంలోని ఏర్ ఫోర్స్ అధికార్లు. సెక్యూరిటీ స్టాఫ్, విమానం నడుపుతున్న సునీల్ —అందరు కోయిలతో నడుస్తూ వెళ్తూన్న సిద్ధార్థను స్పష్టంగా చూశారు.

సునీల్ విమానాన్ని బాగా దిగువగా సిద్ధార్థ నెత్తి మీదుగా రెండు రౌండ్లు వేశాడు. అతని ఎడమ చేతి లోకి రివాల్వర్ ఆటోమాటిగ్గా రావటం సేఫ్టీకాచ్ తప్పించటం చాలా ఆటోమాటిక్ గా జరిగిపోయాయి.

అయితే రమ్య ఈ పరిస్థితి వస్తుందని ముందుగానే వూహించి సునీల్ ప్రతీ చర్యను శ్రద్ధగా ఓ కంట గమనిస్తూనే వుంది. సీనియర్ అధికారికి దివ్యతో అతనన్న మాటలు బెదిరింపు గురించి ముందుగానే చెప్పి తను కూడా ఆ ప్లేన్ లో రావటానికి అనుమతి తీసుకున్నది.

ఇప్పుడు సునీల్ చేతిలోకి రివాల్వర్ రాగానే ఆ అధికారికి సైగ చేసింది.

మరుక్షణం సునీల్ చేతిలోని రివాల్వర్ నుంచి రిలీజయిన బులెట్ సిద్ధార్థ గుండెల్ని చీల్చుకుంటూ పోయేదే.

కాని ఎయిర్ ఫోర్స్ అధికారి చాలా వేగంగా రియాక్టయ్యాడు.

సునీల్ చేతిని గట్టిగా పట్టుకొని అతను విమానాన్ని నేలకూల్చేస్తాడేమోనని తనే విమానాన్ని తన కంట్రోల్ లోకి తెచ్చుకున్నాడు.

విమానంలోని సెక్యూరిటీ సిబ్బంది సునీల్ ని అదుపులోకి తీసుకున్నారు. అంతా క్షణాల్లో జరిగిపోయింది.

"దివ్యా, నీకిచ్చిన మాట నిలబెట్టుకున్నాను, నీ

సిద్ధార్థని త్వరలో నీముందుంచుతాను" అని మనసులోనే అనుకున్నది, మంచి మనసున్న ఎర్ హోస్టెస్ రమ్య.

విమానంలోనించి తాటినిచ్చెన కిందికి జారింది—ఆ వెనుక నే ఏర్ ఫోర్స్ అధికారి గొంతు శ్రావ్యంగా సిద్ధార్థ చెవులకి వినిపించింది.

"మిస్టర్ సిద్ధార్థా, ఇక్కడెక్కడా విమానాన్ని ల్యాండ్ చెయ్యటం కుదరదు. నిచ్చెన ఎక్కి వచ్చెయ్యండి. ఉయార్ ఫ్రం హైద్రాబాద్" చెప్పాడు అధికారి.

కోయిల వంక ఆప్యాయంగా, అభిమానంగా, ప్రేమగా, వాత్సల్యంగా, కృతజ్ఞతగా, బాధగా, బరువుగా—ఇంకా అనేకమైన వ్యక్తీకరించలేని భావాలతో చూశాడు సిద్ధార్థ.

ఆమె కళ్ళు వర్షిస్తున్నాయి. సిద్ధార్థ చేతినందుకుని గాఢంగా చుంబించింది. కన్నీళ్ళతో అభిషేకించింది.

"కోయిలా! నీ మేలు మరచిపోను. నాకు సెలవిప్పించు, నీకు కృతజ్ఞుడ్ని" అన్నాడు సిద్ధార్థ.

కోయిల కన్నీరు తుడుచుకుని స్నేహపూర్వకంగా నవ్వింది.

సిద్ధార్థ చటుక్కున ఆమె చేతి నందుకుని గాఢంగా చుంబించి వదిలాడు.

కోయిల కళ్ళలో కోటి వెలుగులు!

"ఈ జన్మకీ వరంచాలు! మరో జన్మంటూ వుంటే నీ భార్యగా నీ సరసన స్థానం సంపాదించుకుంటాను" మనసులోనే ఆనందంగా చెప్పుకుంది కోయిల.

చకచక తాటినిచ్చెన మీదుగా విమానం ఎక్కాడు

సిద్ధార్థ. అప్పటికి కనీసం పదిసార్లయినా విమానం వాళ్ళ మీదుగా రౌండ్లు వేసింది.

"గుడ్ బై ఫరెవర్!" అన్నాడు మెల్లిగా సిద్ధార్థ.

దిగుతున్న ఎడారి కోయిల చిన్న చుక్కగా మారేంతవరకు ఆవైపే చూస్తూండిపోయాడు సిద్ధార్థ.

—: సమాప్తం :—

అంకితం

సప్తచలాధీశుడు, కలియుగ వైకుంఠమూర్తి, నా ఆరాధ్యదైవం తిరుమల శ్రీనివాసుని చరణార విందాలకు ముకుళిత హస్తాలతో—

—రచయిత.